కథానిక

# కీలకం

శ్రీమతి కందుకూరి సుందరిదేవి

"పన్నెండయినా కాని భోజనానికి లేవరు. శ్రీరాములు గారు మాట్లాడుతూ ఉంటే మీరంతా విశ్వంమరచిపోతారు. నాకు మాత్రం కడుపులో పేగులు మాడిపోతున్నాయి" అని విసురుగానే అంది.

"అందుకనే కాదూ అమ్మగారికి ఎక్కడ కోపం వచ్చేస్తుందోనని వచ్చేస్తా" అంటూనే వంటింట్లోకి లక్ష్మి వెనకాలనే వచ్చి, ఆమె పీటలు విస్తళ్ళువేసి వడ్డించేలోగానే, నెయ్యి మజ్జిగ వగైరాలు తెచ్చి; మంచినీళ్ళు పెట్టేడు. పచ్చడి రెండు విస్తళ్ళలో తనే వేశాడు.

భోజనాలు మొదలుపెట్టి సుభావంగానే అవుతున్నాయి. పప్పుఅన్నం కలుపుకుంటూంటేనే రాజా అన్నాడు "హనుమంతరావు గారు ఖాళీ చేసిన యిల్లు ముప్ఫైరూపాయిలయినా చాలా బావుందయ్యా. లైట్లతో ముప్ఫైమూడు రూపాయలవుతుంది. వేరే కుళాయికూడా ఉంది. పోతే పోయింది యింకో ఖర్చు ఏదైనా తగ్గించుకోవచ్చును. ఒకళ్ళతో సంబంధం లేదు. నాలుగు గదులు, వంటిల్లు. నాకు ఏమైనా కాని, ఈ పరిసరాల్లోంచి వెళ్ళిపోవాలని ఉంది" అంటూ చెప్పుకుపోతూ మధ్యలో లక్ష్మికేసి చూశాడు.

ఆమె రాజా సంభాషణతో తనకేమీ సంబంధం లేనట్లు తలవంచుకునే భోజనం చేస్తోంది.

"ఏం! మారడం నీకిష్టం లేదా?"

"ఏదోవక ఖర్చు తగ్గించుకుందామని సులభంగాఅన్నారు కాని ఏ ఖర్చు తగ్గిస్తారు? మీ సిగరెట్లకు ముప్ఫైరూపాయలు అథమం ఉండాల్సిందేకదా! రాత్రిపూట పెరుగు కావాలి. ఫిల్టరు కాఫీయే కాని పనికిరాదు. యిప్పటికే నెలాఖరు వచ్చేసరికి ఉల్టాసీదా అవుతోంది మనపని అంత అద్దె యిచ్చుకోవడం ఎల్లా?"

ఈ ఉపోద్ఘాతంతో రాజాకు ఈ సంభాషణ ఎందుకు తెచ్చానా అనిపించింది. కోపాన్ని ఉపశమింపచేసి మాటల్లోకి దింపుదామంటే మరింత కోపకారణమైంది.

"పదిగంటలకు కదా పెట్టి తెప్పించారు. ఈ రెండు గంటలకే పెట్టి ఆఖరుచేస్తే యింకేమయినా ఉందా?" అంటూ మళ్ళీ మొదలుపెట్టింది ఎలాగయినా ముగింపు చెయ్యాలనే ఉద్దేశంతో "ఎంత మంది కాల్చేరో నీకేం తెలుసు? అయినా ఈరోజు మొదలుకొని నా సిగరెట్టు సంగతి నువ్వు ఎప్పుడూ ఎత్తొద్దు. యిదివరకే నీకు ఎన్నో సార్లు చెప్పేను, ఆ సంగతి ఎత్తవద్దని. ముప్ఫైరోజులూ కష్టపడి సంపాదించేవాడికి ముప్ఫై రూపాయలు ఖర్చుపెట్టుకోటానికి అధికారం లేదన్నమాట?"

ఈ సమాధానం తలచుకునేసరికి కళ్ళనిండా నీళ్ళువచ్చి ఏడుపుపర్యంతం అయింది పైకి వినిపిస్తే రాజా ఏమైనా అనేసరికి ఏడుపు ఒకటి ఉందికదా ఆయుధం అని, తినే తినేఅన్నం వదిలేసి లేచి వెళ్ళిపోతాడేమోనని లోపల్లోపలే అణచుకొని భోజనం దగ్గర కూర్చుంది. ఒక్క ముద్దయినా లోపలికి పోనేలేదు.

ఎన్నో ఆలోచనలు వచ్చేయి. తను ఐదేళ్ళనుంచీ చూస్తోనే ఉంది. ఒకటి తర్వాత ఒకటి వెళ్ళడం, అడిగిన ప్రతీమాటు తగ్గిస్తున్నానోయి, రేపు ఫస్టునుండి మానేస్తానోయ్ అనే, అరచేతి స్వర్గాలే కాని క్రియల్లో రూపొందించలేకపోయాడు.

ఒక్కసారి చూస్తే ఆరోజు పెళ్ళిపీటలమీద కూర్చొన్న ఆయనికి, ఈనాటి ఆయనకు ఎక్కడా పోలిక లేనే లేదు. యిల్లా రోజుకు రెండు, మూడు పెట్టెలు ఖర్చయితే...... యింక తలచుకోలేకపోయింది.

* * *

సావిట్లోకి వస్తూన్న ఆయన చేతిలో సంచీలు తీసుకుంటూనే "యింకా కొంచం కాఫీ ఉంచే, తీసుకుంటారా! అంటక్కను నీళ్ళు తోరపమంటాను .." అంది.

"కాఫీ యిద్దూ నీకు కాశీకి వెళ్ళినంత పుణ్యం. బజారు నుండి యిన్ని సరుకులు మోసుకువచ్చేసరికి ప్రాణం పైకి పోయింది". రెండు సంచులూ లోపల పెట్టి, గ్లాసు అందిస్తూనే, "చాలా సరుకులు తెచ్చేరు. ఏమాత్రంఅయింది?"

"ఓ ముప్పై పైగా"

"బజారంతా కొనేసినట్లున్నారు ..మీకేం జమీందార్లు"

"కాకపోతే ఏమిటనుకున్నావు మా తాత ఓ యజ్ఞం చేస్తే ముత్తాత మూడు చేసేడు ఆయన పైతాత ఐదు... ఏమనుకున్నావ్!"

"అయితే యిప్పుడు ముప్పైరూపాయలతో ఇవ్వాళ యజ్ఞం మీరూ చేశారన్నమాట మర్చిపోయా కాని. రేపు దీపావళి వస్తోంది మరి.. చీర కొంటారా?"

"మరి అత్తగారికి వ్రాయాలి నాకేం కొంటారని?" ..

"వాళ్ళేమైనా పిల్చేరా?"

"పోనీ బిల్లు పెడదాం!"

"ఆ బిల్లులకేమిటి కానీ మీరిచ్చిన డబ్బులో ఇంటి అద్దె, పాలు, దాసీది, చాకల్ది, పాకీదానికి మాత్రం బిల్లులు చెల్లించా." ఇంక..."

"ఉంచు... ఇంటి ఖర్చుకు సరిపోతుంది"

"ఏమో. మరి మీరు నన్ను అడక్కుండా ఉంటే సరిపోవచ్చు." మాట్లాడకుండానే అతను దొడ్లో నీళ్ళు పోసుకుందుకు వెళ్ళేడు

*          *          *

అవ్వాళ తమలపాకులు ఈ నెలు తీస్తూనే "ఇవ్వాళ గుంటూరు పల్లెఅతను వీశె నెయ్యి పోసి పోయేడండి. ఒకటో తారీఖుకి యిస్తానంటే. .అమ్మగారూ పండుగ వస్తోంది ఇచ్చెయ్యాలన్నాడు...",

"పోనీ ఇచ్చెయ్యక పోయ్యేవా?"

"ఇచ్చేనే. వాడెప్పుడూ ఇంతే.. మనం వాడికదాని దగ్గర పోయించుకున్నప్పుడే వస్తాడు. దీనికి ఇవ్వాలాయె, వాడికి యివ్వాలి"..

"ఊహూ! అయితేకాని పండుగ ఎప్పుడు ఎల్లుండేనా? మరి సరుకులేమైనా కొనమన్నావా?"

"మీ యిష్టం"

"కొనకపోతే ఎల్లా? నిరుడుబోలెడన్ని సరుకులు తెచ్చాం...ఈ ఏడుకూడా. .అయితే ఏమాత్రం పెట్టుబడి పెడ్తావ్?"

"పెట్టుబడి .. నాదగ్గరేముంది...!"

"నాదగ్గరమాత్రం కూర్చుండా?"

"అదే నేనూ అంటూంట ..ఎక్కౌంటు వ్రాస్తూనే ఉన్నా. కావాలిస్తే చూచుకోండి. "అని లోపల్కి వెళ్ళి పుస్తకం తీసుకొచ్చి ముందర పడేసి వెళ్ళిపోయింది. మొదటినుండీ జమా, ఖర్చులూ ఉండనే ఉన్నాయి. సిగరెట్టు వెలిగించి పేజీలు తిరగేశాడు సంవత్సరంలో అన్ని నెలలూ కూడా ఇరవైయ్యో తారీఖువరకే ఆతర్వాత. .ఆఖరయిపోయాయి.

చూచేడు. మొత్తం కూడితే నూటఇరవై అయింది తన జీతం నూటఅరవై ఓ ఖర్చా అందులోంచి మానడానికి వీల్లేందే, అన్నీ అవసరాలే. ఆలోచిస్తే ఇంకా ఆఫీసు జవానుల ఇనాములు, సినీమావాళ్ళ చందా, పేపర్లు వీటి ఖర్చులుపడనేలేదు పైగా పండగొకటి కనీసం ఓ ఇరవై ఖర్చు పెట్టాలి మతాబా సరుకులకోసం ఆఖరుకు ఓ గ్లాస్కో చీరయినా కొనకపోతే ఎల్లాగ? ఓ విధంగా మనస్సు బాధపడింది నిజమే తను ప్రతినెలా నూటఇరవై ఇచ్చేసి అన్నీ చేసుకో అనడంలో, అది ఎంత కష్టపడుతోందో అనిపించింది. ఇవ్వాళ చూస్తే పదిహేనో తారీఖు, యింకా పదిహేను రోజులు గడవాలాయె. చేతిలో చూస్తే .

ఇంకో సిగరెట్టు అంటించేడు ఎల్లాగ ఈ సంసారం గడపాలో అర్థంకానేలేదు తనకంటె తక్కువ జీతం తెచ్చుకునేవాళ్లు ఎలాగ గడుపుతారో? మరి తనేనా!

మరోసారి ప్రతినెలా చూచేడు అన్నీకూడా అల్లాగే ఉన్నాయి. ఉత్సాహంలం కొలవి నెల్లో తన ఖర్చు లెఖ్ఖ

వేశాడు. నెలకు సగటున నలభై అయిదు మొదలు యాభై వరకు ఉంది. ఒక్కసారి గుండె జారింది.

* * *

"ఏమండీ బజారుకు వెళ్లాలండీ"

"ఏం?"

"రేపు పండగకదూ! శెనగపప్పు రెండు శేర్లు, పంచదార ఒకటిన్నర వీశె, కిస్‌మిస్ అరపంపు, జీడిపప్పు పావు వీశె, సేమ్యాలు పావువీశె"...ఆ వరసలోనే ఓ ఇరవై సరుకులు చదివింది.

నిన్నరాత్రి అనుకున్నవన్నీ జ్ఞాపకం వచ్చేయి. నాలుగు స్వీట్లు, రెండు కారాలు, అన్నీ చెయ్యాలి, స్నేహితులు టిఫిన్‌కి వస్తారు. అవి ఒప్పుకుంది. ఇప్పుడు సరుకులు లేకపోతే తనమాటే వమ్మయిపోతుంది.

లేచాడు మహేశ్వరయ్యదగ్గరకు వెళ్లి ఒకట్లో తారీఖున ఇవ్వగలనని అప్పుపెట్టి తెచ్చాడు. ఆవిడ తెల్లబోయింది.

అల్లాగే పండుగ వెళ్లింది. పండుగనాడు సగం క్రంగేషు చీరా తెచ్చాడు. ఇవన్నీ చెయ్యడం చూస్తే ఆవిడ దిగాలు పడింది. ఓసారి వేలునున్న ఉంగరం ఆయనది ఉందో లేదో అని చూచి, ఉండడం గుర్తించి వుటది తెచ్చుకుంది.

ఆరాత్రి ఏదోమాటల్లో "మీ ఆడవాళ్ళకెప్పుడూ డబ్బుగోడవే! లేదులేదు అనుకోవడంతో ప్రారంభించుతారు ఇక నుండి నేనే వాడతా నువ్వుమాత్రం డబ్బుగొడవ ఎత్తవద్దు" అన్నాడు.

తలూపింది. ఓసారి ఈ నెల పైగా నలభైరూపాయల అప్పు అయి ఉండాలే అనుకుంది.

* * *

ఆనెల మొట్టమొదటే అప్పులన్నీ తీర్చెయ్యాలన్న ఉద్దేశ్యంతోనే జీతం జేబులో వేసుకు బయల్దేరాడు

ఇంటిగుమ్మం ఎక్కేసరికి ఎనభైరూపాయలు మాత్రం ఉన్నాయి, మూడు ఒక్కరోజు ముందరాను. పైగా ఇంటి అద్దె, పాలు వగైరాలు నుంచున్నాయి. అన్నిటికంటె సిగరెట్లు అంగడి నర్సయ్య, "అయ్యా! ఈనెల ముప్పైరెండు రూపాయలు అయ్యింది" అన్నాడు.

ఒక్కసారి నరాలు తోడేశాయి. మొన్న డోకులం ప్రారంభించినప్పుడుపడ్డబాధ జ్ఞాపకం వచ్చింది. అప్పుడనుకున్నాడు వెధవ సిగరెట్ మానేద్దామని. ఆరోజు కాల్చనే లేదు. అయినా మర్నాడు స్నేహితుడు ఇచ్చేసరికి మనస్సు ఆగబట్టలేదు, కాల్చేడు దాంతోటి అలవాటు యథాప్రకారం అయింది.

వడ్డించేటప్పుడు చూచేడు, లక్ష్మి చీరలుపాతవి కట్టూందని, రవికె భుజాలమీద చిరిగివుందని, దుఃఖం వచ్చింది. తను సంపాదిస్తున్నా కనీసం బాగా ఉండేందుకైనా చీరలు కొనలేకపోయేడని, పెట్టె జ్ఞాపకం వచ్చింది పెళ్ళినాడు పెట్టిన మంచి చీరలు, రెండు అద్దకాలు తప్ప, ఆవిడ కోటా పెరగనేలేదు. కాని తనుమాత్రం ఉద్యోగం చేస్తూనే ఉన్నాడు. రోజూ సాయంత్రం ఉదయం, పూర్తి టిఫన్ లతోసహా చేయించుకొని .

ఎల్లా ఈ సంసారం గడపడం అన్నది గడ్డుగానే కూర్చుంది. పోనీ సిగరెట్ మానేస్తే! అభిమానం వచ్చింది. వెనక జరిగిన దెబ్బలాటలు జ్ఞాపకం వచ్చేయి "ఛీ! ఆడదానికి లొంగిపోవడమా మగతనం!...అన్న పౌరుషం వెలికింది.

ఆ నెలలో బజారు సరుకులు నూటయిరవై రూపాయలవి తెప్పించింది. ఒక్కసారి కళ్ళు చీకటి కమ్మేయి.

* * *

ఆనెల అప్పులన్నీ తీర్చేశాడు. నరసయ్య బాకీ అయిదు రూపాయలు అంటే ఓవిధంగా తృప్తి వచ్చింది. తను నెల పొడుగునా అంత తక్కువగా సిగరెట్ల బాకీ అయ్యిందని ఓసారి తనకితానే అభినందించుకున్నాడు గబగబా వెళ్లి బట్టల కొట్లో 'ఫిన్లే ఆరు గజాల చీరలు వస్తే నాలుగు నాకు ఉంచండేం' అంటూనే ఇరవైఅయిదు రూపాయలు బయానా ఇచ్చి వచ్చాడు

భోజనందగ్గర కూర్చున్నప్పుడు "ఏమండోయ్.. మీరు ఈమధ్య గుంటూరు కారం తినేస్తున్నారు ఇదివరకు అసలు పట్టేదే కాదు "అంది

నవ్వుకున్నాడు. "సిగరెట్లు మానేస్తే నాలిక సరిగ్గా అయ్యింది" అని చెబుదామనుకున్నాడు కాని అభిజాత్యం చెప్పనిచ్చింది కాదు చెబితే మగతనానికి

* * *

## కీలకం

ఆరోజుల్లో టిఫిన్లక్రింద రోజూ ఓ స్వీట్, హాట్ చెయ్యడంతో తెల్లబోయాడు తన ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలైంది. అంటే సంసారం కుదుటబడుతోందన్న గర్వం ఓసారి తొణికింది.

ఆ నెలలో లక్ష్మి పుట్టినరోజని తెలిసి ఆశ్చర్యపరచాలనే తను నిల్వ చేసిన నాల్గు చీరలు బంగీకట్టి తెచ్చాడు

"ఏమేవ్... రేపు నీ పుట్టినరోజు తెలుసా !"

"బహుమతీ తెచ్చారా ?"

"తప్పకుండా !" అంటూనే బంగీ చేతిలో పెట్టేడు. విప్పింది. ఓసారి ఆశ్చర్యం కలిగింది నాలుగు చీరలు, వాటికి సరిపడ్డ రవికె గుడ్డలు

"అయితే ఈ బ్రాహ్మడికో ."

"ఏం కొనాలేమిటి ?"

"పుచ్చుకున్నా వాయినం..."

"దానికేం. మరోమూడు నెలలవరకూ. ఇంటిసామాను లేవీ కొననక్కర లేదులెండి..."

తెల్లబోయేడు. "అంటే!"

"ఉప్పూ, పప్పూ వగైరా సామానులు"

ఒక్కసారి అర్థం అయింది తాను నేర్పిన విద్యయే. జ్ఞాపకం వచ్చింది. చేతుల్లోకి తీసుకుని "గడుగ్గాయి" అన్నాడు.

కిలకిలా నవ్వింది

బజారులో నర్సయ్య అన్నాడు. 'బాబూ! సిగరెట్లకి రావడం మానేశారు " అని

"మానేశానోయ్" అన్నాడు

ఒక్కసారి కొట్టుకి జార్లపడ్డాడు నర్సయ్య ఆశ్చర్యంతో.

★


# కిన్నెర

## సచిత్ర మాసపత్రిక

ఎడిటర్ : పందిరి మల్లికార్జునరావు ★ అసిస్టెంట్ ఎడిటర్ : పందిరి మీరాబాయి

ఆంధ్రాభ్యుదయానికి కంకణంకట్టుకున్న పత్రిక కిన్నెర ఆంధ్ర జనానీకం పత్రిక కిన్నెర. ఆంధ్ర సేవకై పుట్టిన పత్రిక కిన్నెర మన సంఘం, మన ఆర్థిక జీవనం, ఈ విషమ పరిస్థితులలో ఏవిధంగా పునర్నిర్మాణం కావలసిందీ, మన జీవిత సమస్యలూ, వాటిని యెల్లా పరిష్కరించవలసినదీ వర్ణించే హృదయంగమములైన కథలతోను వినోదాన్ని, విజ్ఞానాన్ని చేకూరుస్తుంది కిన్నెర

భాష సాహిత్యం, శిల్పం, కళ, ఆర్థిక రాజకీయ విషయాలు, శాస్త్ర విషయక వ్యాసాలు, కథలు, నాటికలు మొదలైనవాటితో సర్వాంగ సంపూర్ణంగా ముచ్చటైన ఆకారంతో ప్రకటింపబడుతుంది

విడి కాపీ 6 అణాలు — సంవత్సర చందా 4 రూపాయలు.

మేనేజరు : కిన్నెర, 16, జోన్సు స్ట్రీట్, మదరాసు-1.